# ప్రధాన నివేదిక

# అవలోకనం

## 1.1 పరిచయం

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయాధారిత రాష్ట్రం. రాష్ట్ర జనాభాలో 70 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. ఐతే, సాగుభూమిలో 50 శాతానికి పైగా భూమికి వర్షాలే ఆలంబన కనుక రాష్ట్ర వ్యవసాయ రంగం చాలావరకు ఋతుపవనాలపైనే ఆధారపడి ఉంది. ఆయకట్టు కిందలేని ప్రాంతాలలో కొన్నేళ్లుగా సాగు కోసం భూగర్భ జలాలను వాడుకోవడం పెరిగింది. రాష్ట్రంలో సాగుకు అనుకూలమైన భూవిస్తీర్ణం 362.90 లక్షల ఎకరాలు కాగా, 2004-05 నాటికి, 125.65 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటి సౌకర్యం ఉంది. పైగా, నదులన్నింటి ద్వారా వచ్చే ఆధారపడదగిన నికర జలాల్లో రాష్ట్ర వాటా 2,769 టీఎమ్‌సీలు[1] కాగా, వినియోగించుకుంటున్న జలాలు కేవలం 1,933 టీఎమ్‌సీలు (70 శాతం). కృష్ణా, పెన్నా నదుల ద్వారా వచ్చే మొత్తం నికర జలాలను పలు సాగునీటి ప్రాజెక్టులను నిర్మించడం ద్వారా పూర్తిగా వినియోగంలోకి తీసుకొచ్చినప్పటికీ, గోదావరి నది నీటి సామర్థ్యాన్ని మాత్రం రాష్ట్రం పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంలేదు. అందుబాటులో ఉన్న 1,480 టీఎమ్‌సీలకుగానూ సుమారు 720 టీఎమ్‌సీలను మాత్రమే వినియోగించుకోవడం జరుగుతోంది. కనుక, ఈ విషయం మీద దృష్టి సారిస్తూ కొత్త సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలనీ, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలనీ 2004 మధ్యలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## 1.2 'జలయజ్ఞం' అంటే ఏమిటి?

రాష్ట్రంలో ఉన్న భూములలో అధిక భాగానికి నీటిపారుదల సౌకర్యాన్ని కల్పించడానికీ, ప్రస్తుత ఆయకట్టును స్థిరీకరించడానికీ 2004 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమే 'జలయజ్ఞం'. ఈ కార్యక్రమం ద్వారా, ఈ కింది లక్ష్యాలను సాధించాలని తలపెట్టారు :

i. వెనుకబడిన ప్రాంతాలు, గిరిజనప్రాంతాలు, వర్షాభావ ప్రాంతాల్లో ఈ కింది వాటితో సహా నీటిపారుదలకు సంబంధించిన మౌలిక వసతులను అభివృద్ధి చేయడం :

- రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాల నిర్మాణం, ముఖ్యంగా కృష్ణా, గోదావరి నదులపై వీటి నిర్మాణాలను చేపట్టడం;
- 97.46 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును ఏర్పరచడం, 22.53 లక్షల ఎకరాల ప్రస్తుత ఆయకట్టును స్థిరీకరించడం;

ii. 65.14 టీఎమ్‌సీల నీటిని వినియోగించి రాష్ట్రంలోని 425 మండలాల్లోని 6,310 గ్రామాల్లో నివసిస్తున్న 2.11 కోట్ల ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం;


iii. 2,700 మెగా వాట్ల విద్యుదుత్పత్తి చేయడం.

[1] తౌజండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్ అంటే శతకోటి ఘనపుటడుగులు

ఈ కార్యక్రమం కింద మొత్తం 86 ప్రాజెక్టులు (44 భారీ ప్రాజెక్టులు, 30 మధ్యతరహా ప్రాజెక్టులు, 8 ఆధునికీకరణ పనులు, 4 వరదగట్ల పనులు) ఉన్నాయి. ఈ కార్యక్రమం కోసం అంచనా వేసిన వ్యయం ₹1.86 లక్షల కోట్లు. ఇందులోని 12 ప్రాజెక్టులను 2004-05కు ముందే చేపట్టినప్పటికీ, త్వరితంగా పూర్తి చేయడానికి వీటిని జలయజ్ఞం కిందకు తీసుకొచ్చారు (ఆమోదిత అంచనా వ్యయం : ₹2,139 కోట్లు); 74 ప్రాజెక్టులకు 2004-05 నుండి 2008-09 మధ్య మంజూరీ లభించింది (ఆమోదిత అంచనా వ్యయం : ₹1,83,470 కోట్లు).

## 1.3 సంస్థాగత నిర్మాణం

జలయజ్ఞం కార్యక్రమంతో సహా, నీటిపారుదల - ఆయకట్టు అభివృద్ధి శాఖ విధి విధానాలకు సంబంధించిన వ్యవహారాలను రాష్ట్ర సచివాలయ స్థాయిలో ముఖ్య కార్యదర్శులు లేదా కార్యదర్శులు చేపడతారు. రాష్ట్రంలోని ఒక్కో ప్రాంతానికి ఒక్కరు చొప్పున మూడు ప్రాంతాలకూ[2] ముగ్గురు ముఖ్య కార్యదర్శులు ఉన్నారు. వీరికి తమ విధి నిర్వహణలో సంయుక్త కార్యదర్శులు సహకరిస్తారు. ఐదుగురు ఈఎన్‌సీలు, 33 మంది చీఫ్ ఇంజనీర్లు, సర్కిళ్లకు నేతృత్వం వహించే 88 మంది సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజన్లకు నేతృత్వం వహించే 447 మంది కార్యనిర్వాహక ఇంజనీర్లు వారి కింది స్థాయి సిబ్బంది ప్రాజెక్టుల అమలు బాధ్యతలను నిర్వర్తిస్తారు. నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ సంస్థాగత నిర్మాణ చిత్రం ఈకింది విధంగా ఉంది :




2 కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ